# దొడ్లో తాచు - పాము

మనమంటే ముసలాళ్ళ మైపోయినాం; అనుభవం వచ్చేసింది; నేత్ర-ఉత్తుత్త చూసుకోటాల్లో మన కానందమూ నమ్మకమూ పోయింది. కాని కుర్రాళ్ళ కంత నిబ్బరం ఉండమంటే ఉంటుందా? పొంగి చల్లారిన పాలల్లే వచ్చిపా లెందుకుంటై?

శ్రీనివాసరావు మా రిటైర్డు డిప్టీ కలెక్టరుగారి మేడమీది గదిలో ఉండేవాడు. అసలామేడ కలెక్టరుగారిది కాదు కాని ఇంటాయన శతకోటి లింగాల్లో ఓ బోడి లింగం కావటంచేత కలెక్టరుగారి మేడ అనటం వాడుక. అదెక్కువ మేడ కాదు, చూశారో లేదో. "మన కథాకాలంనాటికి" రొండు మూడేళ్ళ కిందటకూడా డాబా లాగానే ఉండేది. తదుపరి డాబా పడమటివైపున ఒక చిన్న గది నిర్మించబడ్డది. తూర్పు ముప్పాతికా డాబాగానే ఉంటున్నది. కింద నివసించేవాళ్ళతో ప్రమేయం

లేకుండా మెట్లు పక్కనించే పైకిపోతై. ఈ భవంతికి ఇంటి నానుకుని దక్షిణాన ఒకరోడ్డూ పడమట ఒక గల్లీ అంటే శ్రీనివాసరావు తన గదిలోనించి దక్షిణపు కిటికీలగుండా రోడ్డుమీదికీ, పడమటి కిటికీగుండా గల్లీలోకీ. ఉత్తరపు కిటికీల గుండా కలెక్టరుగారి దొడ్డిలోకి చూడవచ్చును. ఆ మర్నాడు స్నేహితుల కాతిథ్యం ఇచ్చి సంగీతాలు పాడించనప్పుడూ, ఈజిల్ ముందు కూర్చుని పాలెట్‌మీద సున్నితమైన రంగులు సృష్టించనప్పుడూ. పై చెప్పబడ్డ కిటికీలలో ఉత్తరపు వాటిముందు కూర్చుని కలెక్టరుగారి దొడ్లోకి చూస్తూ నిట్టూర్చేవాడు.

కలెక్టరుగారి మూడో భార్య ద్రౌపది. ఈడులో ఉన్నపిల్ల, చక్కంది, లోలకులు కూడా పెట్టుకునేది! ఆ లోలకు లేకపోతే శ్రీనివాసరావు తపన కాస్త తగ్గేదేమో! అది అతని మనస్సులో ఒక రావణాసురుడి కాష్టం రగిల్చింది. అది చల్లారే ఉపాయం కనిపించలేదు.

శ్రీనివాసరావు బాధ సులభంగా ఊహించుకోవచ్చు. అసలే ఆర్టిస్టూ, కుర్రవాడూ, అంతవరకూ హృదయం ఎవరికీ కోల్పోయినవాడు కాడూ, చిన్న పిల్లా, అందులో ముసలి మొగుడితో కాపరం! ఇంతకంటె శ్రీనివాసరావును దహించేటందు కేం కావాలి?

ద్రౌపది రోజుకు వందసార్లు దొడ్లో కెందుకు రాదు! అతను చూసినంత మాత్రాన తను అరిగిపొయ్యే దేముంది? అత నంతకన్న ఎక్కువ కోరలేదే?

అసలే దృఢకాయుడు, జ్వాలలో ప్రవేశించినప్పటినించీ మామూలుకు నాలుగింతలు ఎక్సర్‌సైజు చెయ్యటం మొదలుపెట్టాడు. అట్లా కొంత సుఖంగా ఉండేది. ద్రౌపది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతని కండరాలు తాచుపాములల్లే ఉబ్బుకొచ్చేవి. అడ్డం వచ్చినవాళ్ళను కాలితో నేలరాచి ద్రౌపదిని ఎత్తుకుపోదా మన్నంత ఉద్రేకం వచ్చేది.

కొంతకాలంనించీ శ్రీనివాసరావుకు బొమ్మలు రాయటంలో కూడా శ్రద్ధ తగ్గింది. ఒకసారి పెనసలు తీసుకుని స్కెచ్ ఒకటి గీద్దామని ప్రయత్నం చేసేటప్పటికి ద్రౌపది సాక్షాత్కరించింది.

ఒక పండు వెన్నెలనాడు సందూరి సుబ్బారావుకు ప్రాణస్నేహితు డొకతను శ్రీనివాసరావు గదికొచ్చాడు. ఆ డాబామీద వాళ్ళూ వీళ్ళూ అంతా కూర్చున్నారు. ఆ కొత్తతను శ్రావ్యమైన శారీరంలో "యెంకి వంటి పిల్ల" అనే పదం పాడాడు. "నా సామ్మి నా 'ంండె నమిలి మింగిన పిల్ల" అని అతను పాడేటప్పటికి చంద్రుడివంక చూస్తున్న శ్రీనివాసరావు కళ్ళల్లోకి కడివెడు నీళ్ళు తిరిగినై. అత దక్కణ్ణించి జారుకుని గదిలో మంచంమీద బోర్లా పడుకున్నాడు.

"నా సౌమ్య — నా గుండె నమిలి మింగిన పిల్ల!" అట్లా మాటల్ని ఖావాల్లో పెట్టడం దుర్మార్గం కాదూ! తన ప్రాణప్రదమైన రహస్యం — అందరి చెవులకోసమూ వినియోగింపబడుతున్నది!

ఒకరోజు సాయంకాలం అతను మామూలు ప్రకారం షికారుకు పోలేదు. ఆ ఉత్తరపువైపు కిటికీముందు కూర్చుని అదే చూడటం. అతని ఆలోచన లెక్కడికో షికారు వెళ్ళినై. సూర్యాస్తమానమయింది. అతని గదిలో చీకటి పడ్డదికూడాను. కాకులు గోలచేస్తూ చెట్లమీద వచ్చి వాలుతున్నై.

శ్రీనివాసరావు చావగొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు. ద్రౌపది దొడ్లోకి వచ్చింది. కిటికీ కమ్ములమీద శ్రీనివాసరావు చేతిపట్టు బిగిసింది. అతని జీవాలు కళ్ళలో ప్రవేశించి కూర్చున్నై.

ద్రౌపది ఒక తువాలా మల్లెపందిరిమీద వేసింది. సబ్బుపెట్టె నూతి బొడ్డు మీద పెట్టి ఒక కాగులోకి నీళ్ళు తోడుకుంది. తరువాత ఆ కాగు స్నానంచేసే రాతి పక్కగా ఈడ్చి ఇవతలికొచ్చి మెల్లిగా కట్టుకున్న చీరవిప్పి దాన్ని కూడా మల్లెపందిరిమీద వేసి ఒంటిమీద నీళ్ళు పోసుకోవటం మొదలుపెట్టింది.

ద్రౌపది ఒంటిమీది బట్టతోపాటు శ్రీనివాసరావులో నించి నాగరికతా జారి పోయింది. అప్పు డెవరన్నా అతన్ని చూస్తే దడుచుకుని ఉంటారు. ఆకలిగా ఉన్న సింహం ఎరమీద దూకబోతుంటే ఎట్లా ఉంటుందో ఇతనట్లా ఉన్నాడు. అతని కళ్ళు జ్యోతులల్లే ప్రకాశిస్తున్నై. అతనిదీ ఒకవిధమైన ఆకలే! నగ్నస్త్రీ కనిపించగానే అవతలకి పోవలసిన బాధ్యత, నాగరికత తనమీద వేసిందని అతనికి తట్టలేదు. అతనికి సంబంధించినంతవరకూ అది 1932-వ సంవత్సరం కాదు, అతను కళాభ్యాసి కాడు, ఇది హిందూదేశం కాదు. అతను ఆకలిమీద నున్న మగవాడూ, అతని కళ్ళంతా ఆక్రమించుకుని ఉన్న ఆకారం అతని ఆహారమూ! కిటికీలకు చువ్వలులేకుండా ఉంటే....

ద్రౌపది తల ఎత్తి చూసింది! ఆశ్చర్యం ఏమీలేదు. అతని చూపు ఎర్రగా కాలిన ఇనుమల్లే ఆమెకు తగిలి ఉండాలి!

అతన్ని చూడగానే ఆమె మొహం అవమానంతో, పాపం, వికారంగా మారింది. ఆ మార్పు శ్రీనివాసరావు మీద భయంకరంగా పని చేసింది — వేడి ఇనుముమీద చన్నీళ్ళు పడినై. ఒక్క క్షణంలో పోయిన నాగరికత యావత్తూ మణుగుబరువున మీదపడ్డది. అతను చూస్తుండగానే ద్రౌపది స్నానం పూర్తి చెయ్యకుండానే చీర చుట్టుకుని తల వంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

శ్రీనివాసరావు పక్కమీద బోర్లపడి ఏడవటం మొదలుపెట్టాడు. తన కెందుకీబాధ? పాప ఫలితం! ఆమె తన్ను చూడకపోతే తాను చేసిన పని పాపమూ

అయేదికాదు, దానికి ఫలితమూ ఉండేదికాదు. అదివరకు మాదిరిగా ఇప్పుడు ద్రౌపది తన మనసులో పవిత్రస్థానం ఆక్రమించుకోలేదు. ద్రౌపది అపవిత్ర అయిందా? కాదు. తన మనసులో పవిత్రస్థానమంటూ లేకుండా పోయింది. ఎవరూ చూడకుండా చేసేపనికీ చూసేటట్టు చేసేదానికీ తేడా లేదంటారే, మూఢులు! తనాపని చేసేటప్పుడు తన మనస్సు నిర్మలంగానే ఉంది. ద్రౌపది చూడగానే....

దాదాపు రెండుగంటలసేపట్లా ఉన్నాడు. ఆ తరువాత శరీరం విదిలించుకుని లేచి కలం కాగితం తీసుకుని రాయటం మొదలుపెట్టాడు.

"అమ్మా! నేనేం చేస్తున్నానో నాకు తెలియదు. చేతయితే ఈసారికి నన్ను క్షమించు. ఇక ఇటువంటి పని జరగదు!"

ద్రౌపదిని అమ్మా, అని సంబోధించటం అతని కసాధ్యం కాలేదు. అంతకన్న ఇంకో చుట్టరికం లేదిప్పుడు. ఒకనాడు అతను వీధిన నడుస్తుండగా ఒక స్త్రీని రాచుకుపోవటం జరిగింది. అతను కంగారుపడి వెనక్కు తిరిగి చూశాడు. ఆమె కూడా వెనక్కు తిరిగి చూసి, నవ్వి, సాగిపోయింది.

ద్రౌపది అమ్మవరసే. వెంటనే అతను మెట్లుదిగి సందులోకి వెళ్ళి టకీ గుండా ఆ కాగితం ముక్క కలెక్టరుగారి పడక గదిలో పడేశాడు.

రాత్రి పదిగంట లప్పుడు అతని గదిముందు చప్పుడయింది. ఎవరో తలుపు తట్టారు. ఒక లాంతరూ ఇద్దరు మగవాళ్ళూ. అందులో ఒకడు కలెక్టరు గారే, రెండోవాడెవరో తెలియలేదు. అప్పుడప్పుడు వాళ్ళింటికి వస్తుండేవారు; ఏం చుట్టమో?

శ్రీనివాసరావు కంతా అర్థమయింది. చేసేది లేక కాగలదాని కెదురు చూస్తూ నిలబడ్డాడు. నువ్వు చెప్పమంటే నువ్వు చెప్పమన్నట్టు ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. శ్రీనివాసరావులో భయలేశ మేదైనా ఉంటే పోయి నవ్వు వచ్చింది.

చివరకు రెండో అతనే ముందుకొచ్చి మాట్లాడ మొదలుపెట్టాడు.

'ఇదుగో – నీ పేరేమిటో – నువ్వెందు కివాళ్ళ – ఈయనగారి భార్య – స్నానం చేస్తుండగా"–

"ఈసారి ఇటువంటి" – అని కలెక్టరుగా రడ్డం వచ్చాడు.

"ఈసారిదాకా పోతున్నారా? వెధవను, ఇప్పుడే –"

"మాటలు సరిగా రానివ్వండి?" అన్నాడు శ్రీనివాసరావు.

"ఛీ! పేల్తావా?" అని ఆ రెండోవాడు శ్రీనివాసరావుమీద చెయ్యి వేశాడు. శ్రీనివాసరావు ఫెడేల్‌మని అతని దవడమీద పేల్చాడు. ఒక్కక్షణం ఇద్దరూ

నీర్ఘాంతపోయి నిలుచున్నారు. ఆ తరువాత ఏకగ్రీవంగా ఇద్దరూ వీపు తిప్పి పరిగెత్తడం మొదలుపెట్టారు. శ్రీనివాసరావు బిగ్గరగా నవ్వటం మొదలుపెట్టాడు.

మెట్లమీద కలెక్టరుగారు కూకలేస్తున్నాడు రౌండో అయ్యన్ను.

"నే చెబితే వింటావా? కాదు కూడదు, వెధవకు బుద్ధి చెప్పాలంటివి! సామెత చెబుతాడే, అశుద్ధంమీద—"

"వెధవమీద పోలీసు రిపోర్టిస్తాను—"

ఆ సమయానికి ద్రౌపది తన గదిలో చిన్న కాగితంముక్క చదువుకుంటున్నది — పశ్చాత్తాపంతో! మొగుడితో ఎందుకు చెప్పిందో ఆమెకే తెలియలేదు. ఇక ఆ అబ్బాయి తనవంక చూడడు! ఆడవాళ్ళకు చదువూ సంధ్యా లేకపోవడంవల్ల ఇటువంటి అవివేకం జరుగుతూంటుంది! ఛత్!

ద్రౌపదికి ఈ తప్పుదిద్దుకోవటం ఎట్లాగో తెలియలేదు. దొడ్లోకి నూరుసార్లు వచ్చేది. రోజూ తిప్పకుండా మేడమీదికి చూసేది, అతను కనపడితే నవ్వేది.

శ్రీనివాసరావు గుండెమీద చెయ్యి పెట్టుకుని "నా చెల్లెలు నన్ను క్షమించింది!" అనుకునేవాడు. అతని చర్య ద్రౌపదికి అర్థం కాలేదు. ఏమి అతని ఉద్దేశం? అతను వీలు చూసుకుని తన దగ్గర కెందుకురాడు! మొగుడితో చెప్పినందుకు తనమీద పగ పట్టాడా? మరి ఇతను నవ్వితే తిరిగి నవ్వుతాడే? లేక ఇంకా ఉత్తరం రాసిన నాటి ధోరణిలోనే ఉన్నాడా? మగవాడింతకాలం అవిధంగా ఉండగలడా? తన్నేడిపిస్తున్నాడా? ద్రౌపదికి కోపం వచ్చింది!

"గణపతి ఉన్నాడు కాని, ఆ కుర్రవాడు...."

రెండు మూడు నెలలు గడిచినై. ఒకనాడుదయం కలెక్టరుగారు గ్రామాంతరం వెళ్ళాడు. శ్రీనివాసరావు కానాడు నిదరపట్టలేదు. పాపం, ద్రౌపదిఒంటరిగా ఉంటుంది! ఎంత బుద్ధిమంతురాలు! యాభైఅయిదేళ్ళ మొగుడు!

రాత్రి పదిగంటలైంది. కలెక్టరుగారి దొడ్డితలుపెవరో తట్టిన చప్పుడయింది. పడమటి కిటికీ దగ్గిరికి వెళ్ళి చూశాడు. చీకట్లో ఎవరో నుంచున్నట్టుంది. కాని స్పష్టంగా కనపడటం లేదు.

మెల్లిగా ఇంటి దొడ్డివాకిలి తీసుకుని ద్రౌపది బయటికొచ్చి దొడ్డివీధి వాకిలి తెరిచింది. ఎవరో లోపలికొచ్చాడు మగవాడే! హరి, వీడి దుంపతెగా! వినాయకుడా, విఘ్నేశ్వరుడా ............? గణపతి? తనమీద చెయ్యి వేసిన కుంక! శ్రీనివాసరావు హృదయం కుంగిపోయింది. ఆహా! ఎంత మంచి ఇల్లాలు!

శ్రీనివాసరావు గదిలో దీపం లేకపోవటం ఎంతో మేలయిందీ. ఉంటే అతన్ని చూసి ఉండేవాళ్ళే!

పదకొండు! ఈరాత్రి జాగారమే........

పన్నెండు! దూరాన బండి చప్పుడు మరో అయిదు నిమిషాల్లో ఒకబండి వచ్చి కలెక్టరుగారి వీధి గుమ్మంముందాగింది. దాన్లోనుంచి కలెక్టరుగారు దిగాడు! ఆయనే అనుమానమెందుకూ?

"తలుపు! తలుపు!"

శ్రీనివాసరావు గుండెల్లో రైళ్ళు పరిగెత్తినై.

తలుపు! తలుపు!

దొడ్డివాకిలి తెరుచుకుంది. గణపతీ ద్రౌపదీ దొడ్లోకి వచ్చారు. కలెక్టగారు దొడ్డి తలుపు తట్టటానికి చుట్టూ తిరిగి వస్తున్నాడు! శ్రీనివాసరావు గబగబా బయటికొచ్చి వాళ్ళదొడ్లోకి ఎగిరి దూకాడు. దొరికిపోయిన దొంగలిద్దరూ నిలువునా కొయ్యబారిపోయినారు. శ్రీనివాసరావుకు వాళ్ళను గమనించే వ్యవధి లేదు. లోపలికి పోయి రెండంగల్లో లాంతరు పెద్దది చేసి తీసుకొచ్చాడు.

"తలుపు! తలుపు!"

శ్రీనివాసరావు అ ఇద్దరివంకా తిరిగి మాట్లాడవద్దని సంజ్ఞచేసి వెళ్ళి తలుపు తెరిచాడు.

"ఏమిటిదంతా?" అన్నాడు కలెక్టరుగారు అనుమానిస్తూ.

"పోయింది! తప్పించుకుపోయింది! బారెడు తాచు!"

"తాచు వచ్చిందా ఏమిటి దొడ్లోకి?" అన్నాడు కలెక్టరు పెళ్ళాంవంక తిరిగి.

"ద్రౌపది గుటకవేసి అనంది!"

"ఆవిడే చూసింది! తాచు తాచని కేక పెట్టింది. నేను దబదబా దిగి వస్తుండగా, ఈ విసా– గణపతిగారు కనపడ్డాడు. ఇద్దరం వచ్చాం లోపలికి. పోయింది! ఎటు తప్పించుకుపోయింది!" పాపం, ఆమె భయంతో వణికి పోయింది!

"దొడ్డి తలుపేశారేం!"

"తప్పించుకుపోతుందని. నాకు పాము మంత్రం తెలుసులెండి! కనపడితే పట్టుకోగలను!.... సరే, వెళ్ళివడుకుంటా! ఈసారి ఈ దొడ్లో అ తాచు కనపడితే చితకపొడి చేస్తాను!" గణపతి ఒక గుటక వేశాడు.

శ్రీనివాసరావు బయటికి వెళ్ళిన తరవాత కుంటటం మొదలుపెట్టాడు. బెణుకు! ఫరావాలేదు. ఇక తాచు భయంలేదు!

(ప్రథమ ముద్రణ : ఏప్రిల్ 1935, భారతి)